# నమస్తే తెలంగాణ
## నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శనివారం 24 ఆగస్టు 2024 | NAGARKURNOOL




### కాంగ్రెస్‌ది నీతిమాలిన రాజకీయం

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ అధికారం అడ్డం పెట్టుకొని అడ్డదారిలో కైవసం చేసుకున్నది. ఉమ్మడి జిల్లాలో ఒక్క డైరెక్టర్ కూడా కాంగ్రెస్ పార్టీ లేకున్నా బీఆర్‌ఎస్ డైరెక్టర్లను ప్రలోభపెట్టి పదవిని లాక్కోవడం ఇంతకన్నా నీచమైన రాజకీయం మరొకటి లేదు. ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టి ఓడించడంతో అక్రమ మార్గాల్లో డీసీసీబీ చైర్మన్ పదవిని కైవసం చేసుకున్నది. ప్రత్యక్ష ఎన్నికలు జరిగి ఉంటే ఈ పదవి కూడా ఓడిపోవడం ఖాయం.

**- చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**

# అరాచకీయం

**డీసీసీబీ పీఠం ఎంపికలో విలువలకు తిలోదకాలు**

- రాజకీయ ప్రత్యర్థిని అందలమెక్కించిన మంత్రి జూపల్లి
- ఎమ్మెల్యేల డైరెక్షన్‌లో చైర్మన్ ఎంపిక
- బీఆర్‌ఎస్ డైరెక్టర్లకు గాలం
- మండిపడుతున్న విపక్షాలు
- సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ కుయుక్తులు



డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన విష్ణువర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఎంపికలో కాంగ్రెస్ నాయకులు రాజకీయ నైతిక విలువలకు తిలోదకాలిచ్చారు. సంపూర్ణ మెజార్టీ ఉన్న బీఆర్‌ఎస్ నేతలను భయపెట్టి డీసీసీబీ చైర్మన్ పదవిని కైవసం చేసుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చైర్మన్ ఎంపికలో తన రాజకీయ ప్రత్యర్థులకు పట్టం కట్టడం చర్చనీయాంశంగా మారింది. 13మంది డైరెక్టర్లున్న డీసీసీబీ చైర్మన్ ఎంపికకు 11 మంది హాజరయ్యారు. వీరంతా బీఆర్‌ఎస్ మద్దతుతో గెలుపొందిన వారే. వారంతా కలిసి కొల్లాపూర్‌కు చెందిన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. మరోవైపు వైస్ చైర్మన్ పదవి కూడా ఇస్తామంటూ ప్రలోభాలకు దిగారు. కాగా, చైర్మన్ వైస్ చైర్మన్ ఎంపిక విషయంలో పెద్దఎత్తున ప్రలోభాలకు దిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎం సొంత జిల్లాలో డీసీసీబీ చైర్మన్ పదవి కూడా పోతే పరువు పోతుందని భావించి మంత్రి, ఎమ్మెల్యేలు కలిసి బీఆర్‌ఎస్ నేతలకు భారీ ఆఫర్లు ఇచ్చారు. ఇటీవల జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఎమ్మెల్సీ, బీజేపీ ఎంపీ స్థానాన్ని దక్కించుకోవడంతో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. దీంతో పరోక్ష ఎన్నికల్లో ప్రలోభాలకు తెరలేపి డీసీసీబీ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు.

**డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి..**

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆవరణలో శుక్రవారం నాటకీయ పరిణామాల మధ్య డీసీసీబీ చైర్మన్‌గా మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాన్‌గల్ సింగిల్ విండో, డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నారు. నాలుగున్నరేండ్ల కిందట జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఏకంగా 13 స్థానాలను గెలుచుకొని డీసీసీబీ చైర్మన్ పదవిని దక్కించుకున్నది. చైర్మన్‌గా ఉన్న నిజాంపాషా అనారోగ్యానికి గురికావడంతో ఇటీవల ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో చైర్మన్ ఎంపిక అనివార్యమైంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన మెజార్టీ డైరెక్టర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపేలా కుయుక్తులు పన్నారు. నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు విష్ణువర్ధన్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో సంబంధిత అధికారులు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా, ఇద్దరు డైరెక్టర్లు మినహాయించి 11 మంది ఎన్నికలకు హాజరయ్యారు. చైర్మన్‌గా ఎంపికైన విష్ణువర్ధన్‌రెడ్డిని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు అభినందించారు.

**వైస్ చైర్మన్ పదవికి గాలం..**

డీసీసీబీ చైర్మన్ పదవి కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో వైస్ చైర్మన్ పదవిని ఎవరికి ఇవ్వాలనే దానిపై స్పష్టత రాలేదు. కాగా, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డికి చైర్మన్ పదవి ఇవ్వడంతో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ డైరెక్టర్‌కు వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. త్వరలో 12మంది డైరెక్టర్లు సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. పార్టీలో చేరగానే వైస్ చైర్మన్ పదవిని ఒకరికి కట్టబెట్టి వచ్చే ఎన్నికల్లో కూడా వారికే ప్రాధాన్యమిచ్చేలా ఒప్పం దం కుదిరింది. మరోవైపు మిగతా డైరెక్టర్లకు నచ్చజెప్పి పార్టీ ఆదేశానుసారం ఎన్నికకు సహకరించిన వారందరికీ భవిష్యత్తులో పదవులు ఇస్తామని ఆశ చూపారు. దీంతో డీసీసీబీ చైర్మన్ పీఠాన్ని దాదాపు పదేండ్ల తర్వాత కాంగ్రెస్ మెజార్టీ లేకుండా కైవసం చేసుకోవడం రాజకీయ వర్గాలను విస్మయపరిచింది.

## తాగునీటి కోసం నిరసన

- తిమ్మాజిపేట మండలం చేగుంటలో నాలుగురోజులుగా దాహం కేకలు
- ఖాళీ బిందెలతో స్థానికుల ఆందోళన

తిమ్మాజిపేట, ఆగస్టు 23 : తాగునీటి కోసం పదేండ్లుగా కనబడని ఖాళీ బిందెలతో కుస్తీ మళ్లీ కాంగ్రెస్ పాలనలో ఆవిష్కృతమైంది. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో తిమ్మాజిపేట మండలం చేగుంట రోడ్డుపై శుక్రవారం మహిళలు, ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సమస్యను చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల నిరసన తెలుసుకున్న అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ మద్దిలేటిని వివరణ కోరగా, పైల్‌లైన్ లీకేజీతో గ్రామానికి సరఫరా అయ్యే చోట కొందరు మోటర్లు బంద్ చేశారని తెలిపారు. గతంలో గుమ్మకొండలో కూడా పైప్‌లైన్ లీకేజీతో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు.



తిమ్మాజిపేట మండలం చేగుంటలో ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

# భగీరథ నీళ్లు బంద్



వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

- ఐదు రోజులుగా నిలిచిన సరఫరా
- క్లియర్, గేట్ వాల్వ్‌ల ఏర్పాటు కోసం అంతరాయం
- వనపర్తి జిల్లాలో నీటి ఎద్దడి
- జీపీలు, మున్సిపాలిటీల్లో తండ్లాడుతున్న జనం

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఐదు రోజులుగా తాగునీటి కోసం ప్రజలు తంటాలు పడుతున్నారు. వనపర్తి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా భగీరథ పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. ఈలైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేసి దాదాపు 57కిలోమీటర్ల మేర ప్రత్యేక లైన్ ద్వారా తాగునీరు అందించారు. ఈ పైపులైన్ పరిధిలోనే కొన్ని వాల్వ్‌లను అప్పట్లో ఏర్పాటు చేయలేదు. వేసవిలో ఏర్పాటు చేయాలనుకున్నా తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని చేయించలేదని తెలుస్తున్నది. ప్రస్తుతం ఐదు రోజులుగా ఇదే పనిపేరుతో జిల్లాలోని కొన్ని ముఖ్య పట్టణాలు, గ్రామాల్లో నీటి సరఫరా అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. మున్సిపాలిటీ ద్వారా ట్యాంకర్లు నీటిని సరఫరా చేస్తున్నా కాలనీలకు సరిపోవడం లేదు. అలాగే గ్రామాల్లోనూ నీటి సమస్య తీవ్రమైంది.

**ఆరు ప్రాంతాల్లో వాల్వ్స్ ఏర్పాటు..**

రేవల్లి సమీపంలో జీరో వెల్‌సిట్ వాల్వ్, రేవల్లి గుట్ట వద్ద ఎయిర్‌వాల్వ్, వనపర్తి మండలం అచ్యుతాపురం–చిట్యాల మధ్య క్లియర్ వాల్వ్, గేట్ వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. చివరగా పెద్దమందడి మండలం జగత్‌పల్లి సమీపంలో మరో ఎయిర్‌వాల్వ్ పెట్టే పనులు శుక్రవారం సాయంత్రం వరకు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పైపులైన్ స్థితిని బట్టి అవసరమైన వాల్వ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం కూడా నీటి విడుదల కష్టమేనన్న సమాచారం ఉన్నది. కాగా, వర్షాల ప్రభావంతో రెండు రోజులనుకున్న ఈ వాల్వ్ ఏర్పాటు పనులు ఇలా ఐదు రోజులైనా పూర్తికాకపోవడంతో నీటికటకటలు ఏర్పడ్డాయి. ఇదిలా ఉండగా, వనపర్తి మండలంలోని రాజపేట సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య ఉత్పన్నమైంది. ఇలా వేసవిలో పైపులైన్ వేసినప్పుడు చేయాల్సిన పనులు ఇప్పుడు చేపట్టడం.. అందుకు వర్షాల అడ్డంకులు వెరసి ప్రజలకు వేసవిలో లేని దాహార్తి నిండు వానకాలంలో ఉత్పన్నమైంది. కాగా, జిల్లాలోని మిషన్ భగీరథ గ్రిడ్‌లో పని చేసే ముగ్గురు ఏఈలు సైతం జిల్లా నుంచి బదిలీ కావడంతో ప్రస్తుతం అంతా ఖాళీ అయ్యింది.

### నీటిని సరఫరా చేస్తాం

మిషన్ భగీరథ పైపులైన్‌ను అనుసరించి కొన్ని వాల్వ్స్ ఏర్పాటు చేయడం కోసం మంగళవారం నుంచి భగీరథ నీటి సరఫరాను నిలిపివేశాం. రెండు రోజుల్లోనే పూర్తి చేయాలనుకున్నాం. వర్షాలు రావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఆరు చోట్ల వాల్వ్స్ ఏర్పాటు పూర్తయ్యింది. చివరి వాల్ జగత్‌పల్లిలో చేస్తున్నాం. శనివారం నీటి విడుదల కొనసాగిస్తాం.

**- మేఘారెడ్డి, మిషన్ భగీరథ ఈఈ, వనపర్తి జిల్లా**



పెద్దమందడి మండలం జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ పనులు చేస్తున్న భగీరథ సిబ్బంది



మదనాపురం మండలం దంతనూరులో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

### నీటి కష్టాలు తీర్చండి సారూ..



ఎండకాలం కూడా నీళ్ల కోసం ఇంత గోసపడలేదు. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ఎవరిని అడగాలో తెల్వవక ఇబ్బందులు పడుతున్నాం. నల్లా నీళ్లు రాకపోవడంతో ట్యాంకర్లతో తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పదేం డ్లలో ఏరోజూ నీళ్లకోసం గింత ఇబ్బంది పడలే. ట్యాంకర్ల నీళ్లు వాడుకోవడానికి మాత్రమే వస్తాయి. తాగడానికి పనికి రావు. మిషన్ భగీరథ నీళ్లు వదిలి మా కష్టాలు తీర్చండి సారు.

**–సుశీల దంతనూరు, , మదనాపురం మండలం**

### పాత రోజులు గుర్తుకొస్తున్నయి..



ఐదు రోజులుగా నల్లా నీళ్లు రావడం లేదు. ఒకట్రొండు రోజులు ఎలాగోలా సర్దుకున్నాం. ఇన్ని రోజులు నీళ్లు రాకుంటే ఎట్లా. సర్పంచులు ఉంటే అడిగేటోళ్లం. ఇప్పుడు ఎవరికి చెప్పినా పట్టించుకుంటలేరు. 15ఏండ్ల కిందట కాంగ్రెస్ సర్కారులో నీళ్లు లేక పంటపొలాలకు వెళ్లి బిందెల్లో కిలోమీటర్లు నడిచి తెచ్చుకునేటోళ్లం. పదేండ్లు నీళ్లు న ట్టింట్లో వొచ్చినయి. గిప్పుడు మళ్లా పాత రోజులు షురూ అయినట్టున్నయి.

**– చిట్టెమ్మ, మదనాపురం, గ్రామం, మండలం**

### నాలుగు రోజులుగా నీళ్లొస్తలేవు..



వనపర్తి పట్టణంలో నాలుగు రోజులుగా తాగునీళ్లు రావడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీ పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి నీటి కొరతతో పనులు కావడం లేదు. ట్యాంకర్లతో నీళ్లు పోసినా సరిపోవడం లేదు. అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించాలి.

**– శేషమ్మ, లక్ష్మీనర్సింహాకాలనీ, వనపర్తి**

### కార్యాలయాన్ని ముట్టడిస్తాం..



పట్టణంలోని 33వ వార్డులో నీటి సమస్య అధికంగా ఉన్నది. గతంలో అనేక సార్లు తాగునీటి సమస్య గురించి మున్సిపల్ చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోవడం లేదు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మహిళలందరం కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

**–ఏ లక్ష్మి, సాయినగర్ కాలనీ, వనపర్తి**

## సారంబండతండాలో దాహం.. దాహం

- సరిపోని ట్యాంకర్ నీళ్లు



సారంబండతండాలో ట్యాంకర్ వద్ద స్థానికులు

చారకొండ, ఆగస్టు 23 : మండలంలోని సారంబండతండాలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. పది రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కోసం వేసిన బోరు దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ఉండటంతో పైపులైన్లు పూర్తిగా ధ్వంసమై నీళ్లు రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

- మూడు విడుతల్లో ఒక్క పైసా రాలే..
- బ్యాంకోళ్లు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు
- రుణం ఇచ్చేటప్పుడు లేని తప్పులు ఇప్పుడే గుర్తుకు వస్తాయా..?
- ఆందోళన చెందుతున్న రైతులు

### షరతులతో మోసం చేసింద్రు..



ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్నరు. ఇప్పుడు రేషన్‌కార్డు, పేర్లలో తప్పులున్నాయని సాకులు చెబుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసిండు. నా పేరున రూ.లక్షా 80వేల పంట రుణం ఉంది. మూడు విడుతల్లో ఒక్క పైసా మాఫీ కాలేదు. అధికారులను అడిగితే పొంతన లేని మాటలు చెబుతున్నరు. ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే అర్హులందరికీ రుణమాఫీ చేయాలె.**– ముక్తాల వెంకటయ్య, రైతు, కుప్పగండ్ల, వెల్దండ మండలం**

### ఆధార్‌లో పేరు తప్పుందంటున్నరు..



పేరుకే రుణమాఫీ అంటున్నరు. వాస్తవంగా ఎవరికీ మాఫీ కాక బ్యాంకులు, అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. నేను రూ.60వేల రుణం తీసుకున్నా. వడ్డీతో రూ.లక్ష వరకు అయ్యుంటది. ఏ లిస్టులోనూ నా పేరు లేదు. బ్యాంకోళ్లను అడిగితే పేరు తప్పు పడ్డది అంటున్నరు. పంట రుణం ఇచ్చేటప్పుడు ఈ తప్పులు సారోళ్లకు ఎందుకు కనిపించలేదో అర్థమైతలేదు.

**– కానుగుల జంగయ్య, రైతు, కుప్పగండ్ల, వెల్దండ మండలం**

# మొసలి పట్టివేత




మల్దకల్‌లో బావి నుంచి మొసలిని బయటకు మోసుకొస్తున్న ప్రజలు

మల్దకల్, ఆగస్టు 23 : మండల కేంద్రానికి చెందిన సవారన్న పొలంలో సీడ్‌పత్తి సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పత్తిపంటలో కలుపు తీసేందుకు రాగా, మొసలి కనబడింది. భయాందోళనకు గురై పంట యజమానికి సమాచారం అందించారు. దీంతో సవారన్న పోలీసులకు విషయాన్ని తెలిపారు. కానిస్టేబుల్ పురందర్, నిరంజన్ పొలానికి చేరుకొని అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి మొసలిని పట్టుకునే ప్రయత్నం చేస్తుండగా, పంట సమీపంలోని బావిలో మొసలి దూకింది. అధికారులు ఐదుగంటల పాటు శ్రమించి మోటర్ల ద్వారా నీటిని బయటకు తోడి తాళ్ల సాయంతో మొసలిని బయటకుతీశారు. ఆటోలో తరలించి గద్వాల సమీపంలోని కృష్ణానదిలో వదిలేశారు. కాగా, కొన్నాళ్లుగా దేవర చెరువులో మొసలి ఉందని గ్రామస్తులు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఎట్టకేలకు మొసలి పట్టుబడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# ఆపదలో అండగా ఉంటాం

- ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా



బాధితులకు ఎల్‌వోసీలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

అయిజ, ఆగస్టు 23 : ఆపదలో ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం అయిజతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన శస్త్ర చికిత్స చేయించుకునే బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఎల్‌వోసీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

**ఎల్‌వోసీ అందజేత..**

ఉండవెల్లి, ఆగస్టు 23 : ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండల కేంద్రానికి చెందిన జయలక్ష్మి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నది. ఇందుకోసం రూ.3.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో శుక్రవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, రఘురెడ్డితోపాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కారుణ్యం చూపరూ..!

జాబ్‌ల కోసం ఉద్యోగుల వారసుల నిరీక్షణ



కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని పాలమూరు కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

*ఇంటికి పెద్దదిక్కైన ప్రభుత్వ ఉద్యోగి మృతితో నెలనెలా వచ్చే వేతనం నిలిచిపోయి.. చాలీచాలని పెన్షన్‌తో కుటుంబ పోషణ భారంగా మారి.. ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ.. దుర్భర స్థితిలో ఉద్యోగుల వారసులు జీవిస్తున్నారు. జాబ్‌లు ఎప్పుడొచ్చేనా అని కండ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తున్నారు. పాలమూరు జిల్లాలో 49 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరంతా అధికారుల చుట్టూ పదుల సంఖ్యల్లో ప్రదక్షిణలు చేస్తున్నా 'కారుణ్యం' చూపడం లేదని వాపోతున్నారు. ఇంకా ఎన్నాళ్లీ ఎదురుచూపులు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమ గోడును ఆలకించి అర్హత అధారంగా కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతున్నారు.*

*– మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 23*


- కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణలు
- పాలమూరు జిల్లాలో 49 దరఖాస్తులు
- ఎన్నాళ్లీ ఎదురుచూపులంటూ పలువురి నిలదీత
- జూనియర్ అసిస్టెంట్ పోస్టులకే అధిక డిమాండ్
- అధికారులు స్పందించాలని బాధితుల విజ్ఞప్తి

పాలమూరు జిల్లాలో కారుణ్య నియామకాలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటి వరకు 49 మందికిపైగా జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర స్థానిక సంస్థల ఉద్యోగుల వారసులు దరఖాస్తు చేసుకున్నారు. చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు మానసిక కుంగుబాటుతోపాటు కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సంస్థలు, విద్యాశాఖలో పనిచేస్తూ విధినిర్వహణలో మరణించిన ఉద్యోగుల వారసులు తమకున్న అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసు కాలంలో మరణిస్తే అతడి, ఆమె కుటుంబంలో భార్య, భర్త, కుమారుడు, కూతురు లేదా కుటుంబీకుల అంగీకారం ఉన్న వారిలో ఒకరికి కారుణ్య నియామకం ఉద్యోగం ఇవ్వాలి. అతడి, ఆమె అర్హత ఆధారంగా మృతి చెందిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి తత్సమాన ర్యాంక్, విద్యార్హత ఆధారంగా జాబ్ కల్పించాలి. ఉద్యోగుల హక్కే కాకుండా సర్వీసు రూల్స్‌లోనూ ఈ నిబంధన ఉన్నది. ప్రభుత్వ శాఖలకు సంబంధించి కారుణ్య నియామకాలు కొనసాగుతున్నా.. జిల్లా, మండల పరిషత్‌లు, ఇతర స్థానిక సంస్థల్లో మాత్రం సబార్డినేట్ ఉద్యోగాలు తప్పా మిగతా ఉద్యోగాల్లో నియామక ప్రక్రియ ప్రభుత్వం చేపట్టడం లేదు. జిల్లాలో ఎక్కువగా సబార్డినేట్ ఉద్యోగ ఖాళీలే ఉన్నాయి. ఈ ఉద్యోగాల్లో ఉన్నత విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు జాయిన్ అయ్యేందుకు ఆసక్తి చూపడం లేదు.

**జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు డిమాండ్**

కారుణ్య నియామకాలకు ఎదురుచూస్తున్న వారిలో చాలా వరకు గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, బీఎడ్, బీటెక్ చదివినవారు ఉన్నారు. తామంతా డిగ్రీ ఉత్తీర్ణులైనందున జెడ్పీ అధికారులు జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగాలు ఇవ్వాలని రాత పూర్వకంగా అధికారులకు అప్పీలు చేసుకున్నారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రిటైర్డ్ అయ్యేవరకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీఅయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం కొత్తగా సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టిస్తే తప్పా జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల్లో నియామకాలు చేపట్టే వీలు లేదు. ఈ నేపథ్యంలోనే కారుణ్య నియామకాలకు బాధిత కుటుంబాల ఎదురుచూపులు ఎప్పుడు ఫలిస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించి కలెక్టర్ ఆధ్వర్యంలో నియామకాలు చేపట్టే అవకాశం ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదంటున్నారు.

### పింఛన్‌తోనే..



మా నాన్న పెంటయ్య. కోయిలకొండ మండలం ఎల్లారెడ్డిపల్లి యూపీఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మరణించాడు. అమ్మ సరస్వతికి వచ్చే పింఛన్‌తోనే కుటుంబాన్ని పోషిస్తున్నది. ఇల్లు గడవడం కష్టంగా ఉన్నది. నేను డిగ్రీ పూర్తి చేసి డీఎస్సీకి సిద్ధం అవుతున్నా. అధికారులు స్పందించి కారుణ్య నియామకం కింద వెంటనే నాకు ఉద్యోగం కేటాయించాలి.

**- భరత్‌కుమార్, మహబూబ్‌నగర్**

### మీ సంఖ్య 24.. ఆగాలంటుండ్రు..



మా నాన్న నవాబ్‌పేట మండలం కొల్లూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పని చేస్తూ చనిపోయారు. అమ్మ చంద్రకళకు వచ్చే పింఛన్‌తోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. నేను బీటెక్ (సివిల్ ఇంజినీరింగ్) చేశా. నాకు తమ్ముడు, చెల్లి ఉంది. వారిని ఉన్నత చదువులు చదివించేందుకు సైతం ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జెడ్పీ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మీ క్రమ సంఖ్య 24.. కొద్దిగా ఆగాలని అంటుండ్రు. నా విద్యార్హతకు అనుగుణంగా సత్వరమే ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలి.

**- కిరణ్‌కుమార్, తాటికొండ, భూత్పూరు మండలం**

### కొన్ని రోజులుగా తిప్పకుంటుండ్రుం



నా భర్త టీవీఎస్ ప్రసాద్. నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లిలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్)గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో చనిపోయారు. నా కుమార్తె సువర్ణ బీటెక్ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుండగా.. కుమారుడు రోహిత్ ఇంటర్ చదువుతున్నాడు. మా పాపకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇవ్వాలని జెడ్పీ, కలెక్టరేట్‌కు 15 పర్యాయాలకుపైగా వచ్చా. అయినా అధికారులు ఇదిగో, అదిగో అంటూ తిప్పించుకుంటుండ్రు. ఇప్పటికైనా కరుణించాలి.

**- శ్రీలక్ష్మి, ఎర్రసత్యం చౌరస్తా, మహబూబ్‌నగర్**

### జెడ్పీకిపోయి అడుగు అంటుండ్రు..



మా నాన్న ఖాజామియా. నవాబ్‌పేట మండలం ఇప్పటూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ గుండె పోటుతో చనిపోయారు. నేను బీటెక్ కంప్లీట్ చేశా. ఇప్పటి వరకు 15–20సార్లు అధికారుల చుట్టూ తిరిగి ఉంటా. జెడ్పీలో పట్టించుకోరు.. కలెక్టరేట్‌కు వస్తే మాకు సంబంధం లేదు. ఇక్కడంటే.. అక్కడ ఇలా తిప్పుతున్నారు. కలెక్టర్ స్పందించి విద్యార్హత ఆధారంగా జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇవ్వాలి. మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

**- సోహెల్, బాబర్ కిరాణం, షాషాబ్‌గుట్ట, మహబూబ్‌నగర్**